క్లుప్తంగా

సెగ్రిగేషన్ షెడ్ నిర్వహణకు వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం మనుబోతుల చెరువులోని డీఆర్‌సీసీ సెగ్రిగేషన్ షెడ్ ఏడాది పాటు నిర్వహణకు ఈ నెల 16న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పచాయతీ ఈఓ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల గిరిజన అభ్యర్థులు ఈ నెల 15లోపు డిపాజిట్ డీడీ తీసి సంబంధిత ఆధారాలతో వేలంలో పాల్గొన్నాలని తెలిపారు. పూర్తి వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

భద్రాచలంటౌన్: తపాలా శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు రావలసిన సంక్షేమ పథకాలకు అమలుతో పాటు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. స్థానిక గుప్తా కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గ్రూప్–సీ 5వ ద్వైవార్షిక మహాసభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందజేస్తామన్నారు. అనంతరం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్ర స్వామి మాట్లాడుతూ.. తపాలా శాఖలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉద్యోగులు తమ ఆలోచన విధానాలు మార్చుకుని, డిపార్ట్‌మెంట్ పురోభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. సమావేశంలో ఎన్ఏపీఈ గ్రూప్ సి ఆల్ ఇండియా మాజీ కార్యదర్శి డి.కిషన్ రావు, వాసిరెడ్డి శివాజీ, జలీల్, కృష్ణ , బి.ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సిరాజుద్దీన్, రాంకుమార్, మోహన్‌రెడ్డి, పమ్మివెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రమేష్ నాయక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

మణుగూరుటౌన్: ఇందిరమ్మ ఇళ్లపై బీజేపీ నాయకులు నోటికి వచ్చిన విధంగా మాట్లాడటం సరికాదని, ఆరోపణలను సాక్ష్యాధారాలతో మీడియా ముఖంగా నిరూపించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి.నవీన్ అన్నారు. ఆదివారం మండల కార్యాలయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై నిందలు వేయలని ఉద్దేశంతో బీజేపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేదోళ్లకు రూ.5లక్షల ఇళ్ల మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ సైదులు, కుచిపూడి బాబు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సూపరరెడ్డి తరుణ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, పాల్వంచ రాములు, రహీంపాషా, మాదాడి రాజేశ్, చింతల కృష్ణ, పల్లం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

మణుగూరురూరల్: మండలంలోని పీవీకాలనీలో ఉన్న గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో హెల్దీ అండ్ హ్యాపీ లైఫ్ స్టైల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీనియర్ వెల్‌నెస్ లైఫ్ కోచ్ వై.వీర నాగరాజు మాట్లాడుతూ.. మనిషి శరీరానికి అవసరమైన ప్రోటీన్ల ఆహారాన్ని తీసుకోకపోవడం, చెడు అలవాట్లు, నిద్రలేమి వంటి వాటితో వివిధ రుగ్మతలను మనిషి ఎదుర్కొంటున్నాడన్నారు. వీటిని నివారించేందుకు ఆహార అలవాట్లను పాటించాలని సూచించారు. హెల్దీ అండ్ హ్యాపీ లైఫ్ స్టైల్ సభ్యులు అబ్దుల్ రవూఫ్, షాకీరా, పద్మావతి, శ్రీనివాస్, సంధ్య, భాస్కర్, బాబు, వెంకమ్మ, వరలక్ష్మి, రామలక్ష్మి, కాలనీ వాసులు నాసర్‌పాషా, జమీల, షాబుద్దీన్, నాగరాజు పాల్గొన్నారు.

బీసీ సభకు తరలిన నాయకులు

కరకగూడెం: బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆదివారం భద్రాచలంలో తలపెట్టిన 'బీసీల సంక్షేమ సంఘం– సమర శంఖారావం'సదస్సుకు మండలంలోని బీసీలందరూ భారీగా వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. హక్కులను సాధించుకోవాలంటే బీసీలందరూ కుల, మత, ప్రాంతీయ బేధాలను విస్మరించి ఒకే వేదికపైకి రావాలన్నారు. బీసీ నాయకులు కొంపెల్లి పెద్దరామలింగం, రావుల సోమయ్య, బైరిశెట్టి చిరంజీవి, వెంకన్న, సిరిశెట్టి కమలాకర్, పోగు వెంకటేశ్వర్లు, ముంజాల వసంత్ గౌడ్, బుడగం రాము, బూరగడ్డ రవి, సమ్మయ్య, బొంగొని గణేష్, రావుల రవి తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

తుమ్మలను కలిసిన బీసీ నాయకులు

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పలువురు మండల బీసీ సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించడం పట్ల బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను శాలువాతో సత్కరించారు. అంతకుముందుగా ఆత్మ డీపీడీ సరిత, అశ్వారావుపేట ఆయిల్ పామ్ డీఓ రాధకృష్ణ, మంత్రి తుమ్మలను మరాద్యపూర్వకంగా కలిశారు. బీసీ నాయకులు దొడ్డాకుల గోపాలరావు, కేవీ.సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, లక్ష్మణ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకే పట్టం

- శ్రమ, పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ
- పెరిగిన ఆధునిక యంత్రాలు
- అందుతున్న గిట్టుబాటు ధర


మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న కూలీలు

గుండాల: నాడు మిర్చి, పత్తి పంటల సాగు చేసిన రైతులు రోజురోజుకూ శ్రమ.. పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ ఉన్న పంటలపైనే ఆశక్తి కనబరుస్తున్నారు. ఆ దిశలోనే గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో రైతులు మొక్కజొన్న సాగు దృష్టి సారిస్తున్నారు. ప్రతీ ఏడాది మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతూ రావడమే ఇందుకు నిదర్శనం.

మొక్కజొన్నకు సంబంధించి దుక్కి దున్నింది మొదలు పంట నూర్పిడి వరకు యంత్రాలు అందుబాటులోకి వస్తున్నాయి. కలుపు మందులు, పురుగుమందులు మార్కెట్‌లో పుష్కలం. ఇక మార్కెట్‌లో గిట్టుబాటు కూడా బాగానే ఉంది. దీంతో సహజంగా రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు.

పెరిగిన మక్క సాగు..

వేసవి దుక్కులు చేసుకున్న రైతులు ఇటీవల కురిసిన తొలికరి జల్లులకు విత్తనాలు వేసుకున్నారు. తొలిదఫా కురిసిన తొలకరి జల్లులకే విత్తనాలు వేయగా.. ఆ తర్వాత ఎడతెరపి లేకుండా కురిసిన వానలకు పలుచోట్లు మొలకెత్తాయి. ఇంకా రైతులు విత్తనాలు చల్లుటలో బిజీగా ఉన్నారు. గుండాల మండలంలో సుమారు 40 వేల ఎకరాలు, ఆళ్లపల్లిలో 20 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుంది. గతంలో పత్తి, మిర్చి అధికంగా సాగు చేసేవారు. అయితే శ్రమ ఎక్కువ ఉండడంతో పాటు, పెట్టుబడి అధికంగానే ఉండేది. చీడపురుగు బెడద, కూలీల కొరత తీవ్రంగా ఉండేది. మొక్కజొన్న సాగులో విత్తనాలు వేసేందుకు మాత్రమే కూలీలు అవసరం. పత్తి, మిర్చి పంటలతో పోల్చుకుంటే శ్రమ లేదు. మక్కలకు కలుపు మందులు పిచికారి చేస్తే సరిపోతుంది. సకాలంలో వానలు లేకపోయినా ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్ చొరవతో మండలంలో విస్తారంగా బోర్లు వేయించుకున్నారు.

తగ్గిన పత్తి, మిర్చి సాగు..

పత్తి, మిర్చి పంటలు సాగు చే యాలంటే రైతులు ఓ సాహసంలా ఉంటుందంటున్నారు. అధిక పెట్టుబడి పెట్టడం, పంట చేతికొచ్చాక గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చేది. దుక్కిటెడ్లతో సాలు చేయడం, కలుపు నివారణకు పై పాటు నాగళ్లతో చేయడం, విత్తనాలు వేసేందుకు, కలుపు తీసేందుకు, పత్తి, మిర్చి ఏరేందుకు ఇలా ప్రతీ పనికి కూలీల అవసర ఏర్పడేది. కూలీల కొరత ఉండడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తెప్పించుకుని, వసతి కల్పించి, అధిక కూలీతో పనులు చేయాల్సివచ్చేది. కానీ మొక్కజొన్నలో ఆలాంటి ఇబ్బందులు ఏమీ లేవు. ప్రతీ పనీ యంత్రాలతోనే సాగు సులభమవుతుంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర కూడా ప్రతీ ఏడాది ఎక్కువగా ఉంటుంది.

మండలంలో ఎరువుల కొరత

మొక్కజొన్న సాగుతో పాటు, వరి ఇతర పంటు సాగు చేస్తున్నారు. దీంతో సాగు విస్తీర్ణం అంచనాకు మించి పెరగడంతో ఎరువుల కొరత తీవ్రంగా ఉంది. వాగుల ఆవతన చేన్లు ఉండడంతో ఒకేసారి ఎరువులు నిలవ చేసుకుంటున్నారు. ప్రస్తుతం పీఏసీఎస్, ప్రైవేటు డీలర్ల వద్ద రైతులు పోటీలు పడుతున్నారు. అయినా సరిపడా యూరియా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయా మండలాల రైతులు వేడుకుంటున్నారు.

దిగుబడి బాగానే ఉంటుంది..



దిగుబడి ఎక్కువగా ఉండడంతో ఎక్కువ మొత్తంలో మొక్కజొన్న, తక్కువగా పత్తి, మిర్చి పంట సాగు చేస్తున్నాను. కూలీల కొరత ఎక్కువగా ఉన్నందున యంత్రాలతో సాగు ఈజీ అవుతుంది.

– తాటి రమేష్, గుండాల

శ్రమ, పెట్టుబడి తక్కువ



మొక్కజొన్న సాగుకు శ్రమ ఎక్కువ లేదు. పెట్టుబడి తక్కువగా ఉంటోంది. కూలీల కొరత, రేట్లు ఎక్కువ, యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. అందుకే మక్కజొన్న సాగు చేస్తున్నా.

– పెండెకట్ల బాటయ్య, గుండాల

గంజాయి టెస్టింగ్ కిట్‌తో పరీక్షలు


గంజాయి టెస్టింగ్ కిట్‌పై యువతకు అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

అశ్వాపురం: మండలంలో నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి టెస్టింగ్ కిట్‌తో ఆదివారం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి ఎవరైనా వినియోగిస్తే మూడు రోజుల వరకు కూడా టెస్టింగ్ కిట్‌తో తెలుసుకోవడం సాధ్యమవుతుందని, వారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని అన్నారు. గంజాయి సరఫరా, వినియోగంపై సమాచారం సేకరిస్తున్నామని, సరఫరాదారులపై నాన్‌బైలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గంజాయిపై ఏమైనా సమాచారం ఉంటే అశ్వాపురం ఎస్‌హెచ్‌ఓ మొబైల్ నంబర్ 8712682093కి గాని డయల్ 100కు గాని ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని అన్నారు.

ఇరిగేషన్ డీఈకి మాతృవియోగం

మణుగూరురూరల్: మండలంలో విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ శాఖ డీఈ బర్ల రమేష్ మాతృమూర్తి బర్ల సత్యమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల అధికారులు, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు సమితిసింగారం గ్రామపంచాయతీలోని వారి గృహానికి వెళ్లి సత్యమ్మ భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. సంతాపం తెలిపిన వారిలో ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ విస్తరణ అధికారి కొమరం లక్ష్మణ్‌రావు, టీడీపీ పినపాక నియోజకవర్గ నాయకులు వట్టం నారాయణదొర, మాల మహానాడు మండల అధ్యక్షుడు వేర్పుల నరేష్, కూనవరం మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, న్యాయవాది విజయ్, రాము తదితరులు ఉన్నారు.

'గౌడ్'ల వనమహోత్సవం


బొడ్రాయికి పూజలు చేస్తున్న భక్తులు

గుండాల: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, పిల్లా పాపలు చల్లంగా చూడాలని.. బొడ్రాయి, ముత్యాలమ్మలకు గౌడ కులస్తుల ఆధ్వర్యంలో జలాభిషేకం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని గౌడ కులస్తులు వన భోజనాలకు వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామ దేవతలైన బొడ్రాయి, ముత్యాలమ్మకు దీప, దూప నైవేద్యాలతో పాటు జలాభిషేం నిర్వహించారు. ఆచార సాంప్రదాయాలతో వన దేవతలను మొక్కి నైవేద్యాలను సమర్పించారు. కిన్నెరసాని నదిలో జలకాడుతూ సందడి చేశారు. దీంతో పండుగ వాతావరణం చోటు చేసుకుంది.

బాలాజీ దేవస్థానంలో సుదర్శన హోమం


స్వామివారి సన్నిధిలో సుదర్శన హోమం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శనహోమం నిర్వహించారు. స్వామివారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రావణనక్షత్రం సందర్భంగా క్రతువు జరిపించారు. ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆటో డ్రైవర్లపై 'మహాలక్ష్మి' ప్రభావం


మాట్లాడుతున్న సాంబశివరావు

కరకగూడెం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే 'మహాలక్ష్మి' పథకం అమలు ఆటో డ్రైవర్ల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు కొమరం సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేసారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల తమ బతుకులు ఆగం అయ్యాయని, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అద్దెలు, వాహన ఈఎంఐలు కట్టడం కష్టంగా మారిందని వాపోయారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే గుర్తించి పరిష్కరించాలని కోరారు. రూ.12,000 ఆర్థిక సహాయాన్ని తక్షణమే విడుదల చేసి హామీని నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు నిట్ట సౌందర్యరావు, లక్ష్మీనారాయణ, గుడ్ల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని వివిధ గ్రామాల్లో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శాఖాధికారులు ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. అన్నపురెడ్డిపల్లి, మర్రిగూడెం, రాజాపురం, నామవరం, పెంట్లం, భాస్కరాపురం, కంపగూడెం, అన్నదైవం, ఒడ్డుగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెం పరిధిలో నేడు(సోమవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరత్నం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్వారిగూడెం ఫీడర్‌లో సోమవారం మరమ్మతులు నిర్వహించనున్న కారణంగా పట్వారిగూడెం గ్రామ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. 400 నుంచి 600 చదరపు అడుగులు విస్తీర్ణం పెరగకుండా ఇంటిని నిర్మించుకోవాలని, విడతల వారిగా ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని నాయకులు లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు హర్ష, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గొల్లపల్లి నరేష్, శశికాంత్, వేముల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'కోట' మృతికి సంతాపం

భద్రాచలంటౌన్: ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాస్‌కు భద్రాద్రి అనుబంధం ఉండడంతో ఆయన మృతి పట్ల పట్టణంలోని పలువురు కళాకారులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భద్రాద్రి కళాభారతి వ్యవస్థాపకుడు అల్లం నాగేశ్వరరావు సంతాపం తెలయజేస్తూ.. కోట శ్రీనివాస్ ఇంటికి వెళ్లినప్పుడు భద్రాచలం రాముడిని దర్శించుకోవాలని సూచించినట్లు తెలిపారు. కొద్ది రోజులకే భద్రాచలం వచ్చిన కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి రామాలయ దర్శనం చేసుకున్నారని గుర్తు చేసుకున్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్‌లోని సరోజిని వృద్ధాశ్రమానికి తెలంగాణా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం వితరణను అందజేశారు. అనాథ వృద్ధుల ఆశ్రమంలో రూ.50 వేల విలువైన నిత్యావసర సరుకులను ఆశ్రమ నిర్వాహకురాలు సరోజినీకి అందజేశారు. ఈ విశ్వనాథం, సత్యనారాయణ, కొల్లు నాగేశ్వరరావు, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

అడవులను తలపిస్తున్న రహదారులు


కొత్తగూడెం- కుర్నపల్లి రోడ్డు మలుపుల్లో దారిని మూసేసిన చెట్లు

చర్ల: చర్ల మండలంలోని పలు గ్రామాలకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారులు అడవులను తలపిస్తున్నాయి. రోడ్ల పక్కన మొలచిన చెట్లు, పిచ్చి మొక్కలు రోడ్లను మూసేస్తుండడంతో ఆయా మార్గల్లో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మూల మలుపుల్లో రోడ్లు మూసుకుపోతుండడంతో ఎదురెదురుగా ప్రయాణిస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. దగ్గరకు వచ్చేంత వరకు కనిపించక పోతుండడంతో అదుపు తప్పి రోడ్డు ప్రక్కకు దూసుకుపోతున్నాయి. మండలంలోని పులిగుండాల రోడ్, కుర్నపల్లి రోడ్, తిప్పాపురం–చెన్నాపురం రోడ్, పూసుగుప్ప రోడ్లలో ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఈ ప్రాంతాల్లో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్అండ్‌బీ శాఖాధికారులు తక్షణమే స్పందించి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోడుభూముల కోసం పోరాటాలు



సదస్సులో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

బూర్గంపాడు: ఏళ్ల తరబడి ఆదివాసీలు సాగు చేస్తున్న పోడుభూములకు పట్టాలిచ్చే వరకు పోరాటాలు కొనసాగించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బుడ్డగూడెం గ్రామంలో పోడు రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు రైతులకు పట్టాలిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలన్నారు. పోడురైతులపై ఫారెస్ట్ అధికారుల దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రేపాకుల శ్రీనివాస్, బత్తుల వెంకటేశ్వర్లు, మిడియం పుల్లయ్య, కొడెం వెంకటేశ్వర్లు, కుర్సం తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ

దుమ్ముగూడెం: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ కేంద్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ డివిజన్ నాయకుడు దాసరి సాయన్న పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్లగూడెం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న ఇల్లందులో స్మారక స్థూపం ఆవిష్కరణ ప్రదర్శన వర్ధంతి సభను నిర్వహించడం జరుగుతుందని, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం సభ సంబంధిత వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రామ్‌చిట్టి, కొరసా రాంబాబు, నగేష్, లక్ష్మి, సావిత్రి, రామలక్ష్మి, కన్నయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ కేంద్ర కమిటీ నాయకులు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ పాల్వంచ డివిజన్ నాయకులు గోగినపల్లి ప్రభాకర్ కోరారు. ఆదివారం మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలో జరిగిన సమావేశంలో ప్రథమ వర్ధంతి సభ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన ఇల్లెందులో జరిగే సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వాసం బుచ్చిరాజు, కుంజా అర్జున్, కంగాల భూలక్ష్మి, కొమరం చిన్నలక్ష్మి, కొమరం సింగమ్మ పాల్గొన్నారు.

తలంబ్రాల వడ్లకు పూజ


కోటి గోటి తలంబ్రాల వడ్లకు పూజలు చేయిస్తున్న రామ భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించే స్వామివారి కల్యాణ మహోత్సవంలో వినియోగించే కోటి గోటి తలంబ్రాల వడ్లకు దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ చెందిన శ్రీరామదాసు భక్త మండలి వారు కోటి గోటి తంబ్రాల వడ్లను రామదాసు తిరుపతమ్మ–తిరుపతి దంపతులు వారి సొంత క్షేత్రంలో పండిస్తారు. ఇలా పండించిన వడ్లను భక్తుల సహకారంతో అత్యంత భక్తిశ్రద్ధలతో గోటితో ఒలిపించి సీతారాముల కల్యాణానికి వినియోగానికి అందజేస్తారు. ఇప్పటికి 9 ఏళ్లగా కోటి గోటి తలంబ్రాల వడ్లను రామయ్యకు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ సాయిబాబు, సీసీ శ్రీనివాసరెడ్డి, భక్త రామదాసు పదవతరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావు, ఉషారాణి, కొమ్మిడి రజిత రెడ్డి, విజయ, రమ, అంజలి రామభక్తులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

భద్రాచలంఅర్బన్: తనకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని బాధిత మహిళ యామిని తెలిపింది. ఆదివారం భద్రాచలం హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడింది. న్యాయం కోసం మరోసారి కోర్టుకు వెళ్తానని పేర్కొంది. తన విడాకుల కేసు విషయంలో న్యాయవాది వద్దకు వెళ్తే, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. కొందరు పోలీస్ అధికారులు నిందితుడు వైపు ఉన్నారని ఆరోపించింది. నిందితుడికి కఠినమైన శిక్ష పడే వరకు పోరాటం చేస్తానని తెలిపింది.

ఘనంగా బోనాల వేడుకలు


అశ్వారావుపేటరూరల్: ఆసుపాకలో బోనాలతో ప్రదర్శనగా వస్తున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక, అశ్వారావుపేటలోని మద్దిరావమ్మ గుడి, కొనేరు బజారు, డ్రైవర్స్ కాలనీలోని ఆదివారం ఆషాఢ మాసం సందర్భంగా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా బయలుదేరి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయం, శ్రీ ముత్యాలమ్మ తల్లికు బోనాలను సమర్పించారు. అలాగే చెన్నారాయుడి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మద్ది రాము రెడ్డి, గుడ్ల రామ్మోహన్ రెడ్డి, అచ్చి శ్రీనివాస్ రెడ్డి,మామిడి రాజు, డీంగి రాంబాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ జాతర..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే గ్రామ దేవతల జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉదయమే అమ్మవార్ల ప్రతిరూపాలైన శక్తి స్వరూపాలు పూనకాలతో మేళతాళాల నడుమ డప్పు, సన్నాయి వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ మరిడమ్మ తల్లికి ఆహ్వానం పలికారు. అనంతరం అమ్మవార్లకు 108 బిందెలతో పసుపు, కుంకుమ కలిపిన నీళ్లతో నిండు స్నానాలు చేపట్టారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి మరిడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గరుడ దీపాన్ని దేవర బాల శిరస్సును పెట్టుకుని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. భక్తుల ఇంట ప్రత్యేక పూజలను అందుకున్నారు. మరిడమ్మ వృక్షం వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, దల్లి హరిబాబు, గోసుల వెంకటేశ్వరరావు, పిట్ట కృష్ణారెడ్డి, డింగి అప్పన్న,

వనదుర్గమ్మకు ఆషాఢ సారె

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో గట్టుపై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో వన దుర్గాదేవికి ఆషాఢ సారెను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ఘనంగా సమర్పించారు. అమ్మవారికి అభిషేకం, అర్చన, కుంకుమ పూజలు తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. శివాలయ సన్నిధానం నుంచి మేళతాళాలతో వన దుర్గాదేవి ఆలయం వరకు మహిళలు ఆషాఢ సారెతో ఊరేగింపుగా వెళ్లారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని, ఆషాఢ సారెలను ఘనంగా సమర్పించారు. అమ్మవారి సందర్శనకు విచ్చేసిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రావు గంగాధరరావు, కోశాధికారి చందా సుబ్బారావు ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


దుమ్ముగూడెం: మరిడమ్మ జాతర ఊరేగింపులో భక్తులు, గ్రామస్తులు..


దమ్మపేట: ఆషాఢ సారెతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు